# ★ తేలం ముద్దు ★

అంగర వెంకట కృష్ణారావు

---

ఎవరో వొక మహాభక్తుడు శివాలయంలోంచి వస్తూ గుమ్మంలో ఒక నాణెం జారవిడిచేడు. అది టంగున క్రిందపడింది. చీకటిలో విద్యుద్దీపాలు వెలుతురిస్తున్నా, వచ్చీ పోయే జనం, బళ్లూ కారులూ యెక్కువగా క్రీనీడలు కలిగిస్తున్నాయి.

ఆ శివాలయం చాలా పేరుపడ్డది. ప్రతి సోమవారం దానిలో కొన్ని వేల కొబ్బరికాయలు పగులుతాయి, వాటి నీళ్లత్రాగి స్వామి దేశంలో వున్న కరువు మరిచిపోయి - భక్తులకు యిలోధి కాక్షివృద్ధికి వరాలు ప్రసాదిస్తాడు.

ఆలయం వెలపల రెండుపక్కలా బారులు తీర్చి దేశానికి నిజమైన ప్రతినిధులు కూర్చుంటారు. ఇతర దేశాలకు వెడుతూన్న భారతప్రతినిధులను చూసి ఆయా దేశాల ప్రభుత్వాలు యేమనుకుంటాయో, లోపలికొచ్చి కొబ్బరికాయలు పగులగొట్టే భక్తులశరీర పుష్టిచూసి స్వామి కూడా అదేఅనుకుంటాడు.

తిండి, గుడ్డ, వసతి లేక మలమలమాడే ప్రజల స్థితి తెలియని యితరదేశస్థులవలె, స్వామి కూడా ఆలయం బైటవున్న కుంటి, గుడ్డి, రోగిష్ఠి, అనాథ భిక్షువుల స్థితియెరగడు. ఎరిగివుంటే యిన్నాళ్లు వాళ్లాస్థితిలో యెలావుంటారు?

ఆవేళ భక్తుడు తన భక్తిపారవశ్యంలో వొక నాణెం జారవిడవగానే సమీపంలో నేవున్న కుంటివాడు దానిమీద చెయ్యివేసేడు. పక్కనే వున్న సొట్టచెయ్యివాడు తనకాలు వాడిచెయ్యి మీద నొక్కేడు. కిందవున్నది పావలావో, అర్థరూపాయో, రూపాయో యెవరికెరుక! భక్తుడు భక్తిపారవశ్యంలో జారవిడిచినది యేదైనా కావచ్చు!

కుంటివాడు 'హుం' అన్నాడు సొట్టవాడు 'హాం' అన్నాడు. తియ్యి కాలంటే, తియ్యి చెయ్యనుకున్నారిద్దరూ. కిందనున్నది బంగారు కాసేమోనని వాళ్ళఆశ. ఆవేళతో దరిద్రం తీరిపోతుందని వాళ్లపీకు.

ఇంతలో బెల్లంమీద యీగల్లా ముష్టి వాళ్లంతా చుట్టబెట్టేరు వాళ్ళిద్దరినీ. దారిపోయే వాళ్లు కూడా యీ తమాషా చూడటానికి మూగేరు. కొన్ని బళ్లు కూడా యిటూ అటూ నిల్చిపోయేయి.

సొట్టవాడు యెడంకాలుతో కుంటివాడిని తన్నేడు. కుంటివాడు యెడంచేత్తో సొట్టవాడికి తొడపాయసం పట్టేడు.

మంత్రివర్గంలా ముష్టివాళ్ళంతా తక్షణం రెండు పార్టీలైపోయేరు. మొదట హుంకరింపులు, తరవాత తిట్టుకోడాలు, ఆపైన కొట్టుకోడాలు జరిగేయి. 'లక్ష్మమ్మ'లో శివరావు చెప్పినట్టూ కొంతసేపటివరకూ అంతా 'మోతమోత'గా జరిగింది.

ఈశ్వరుడికి యివేవీ వినపడకుండా లోపలి భక్తులు గంటలు వాయిస్తున్నారు జోరుగా. పైన ముష్టివాళ్ల బుఱ్ఱలమీద పోలీసుల కఱ్ఱ లెగురుతూంటే, ఆలయంలో కొబ్బరికాయల బుఱ్ఱలు 'పటేలు పటేలు' మంటున్నాయి. ఈశ్వరుడు 'నీరో'లా ఆనందిస్తున్నాడు.

తరవాత కొంతసేపటికి కొత్తకొత్తగా దెబ్బలు తగిలించుకుని ముష్టివాళ్ళంతా మూలుగుతూ యెవరిదారిని వాళ్ళుపోయేరు. శివుడు తలుపులు వేసుకొని నిద్రపోయేడు, అమ్మవారితో సహా.

మరొక్క గంటకి నేనా తోవని వెళ్లడం తటస్థించింది తిరిగి. ఆలయం గుమ్మంలో యెవరో యేదో వెతుకుతున్నట్టయింది.

'ఏమిటండీ వెతుకుతున్నారు- ఏమైనా పోయిందా?' అని ప్రశ్నించాను.

'ఔనండీ- గంటన్నర క్రిందట శివుడికి కొబ్బరికాయ కొట్టి వెళ్లిపోతూంటే చేతిలోంచి జారిపడిపోయింది' అన్నాడు వెలరాళ్లతో మెరుస్తూన్న మూడుంగరాలు గల కుడిచెయ్యి ఆదోక జగన్మిథ్యాత్మక భావం స్ఫురించేలా తిప్పుతూ, ఆ లక్ష్మీపుత్రుడైన పరమ భక్తుడు.

'ఏమిటి పడిపోయింది?'

'ఒక చిల్లికాణీ.'